క్లుప్తంగా

4న ఎస్ఆర్ఆర్‌లో జాబ్ ఫెయిర్

మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జవహర్ విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యాన ఈ నెల 4వ తేదీన జాబ్ ఫెయిర్ నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రముఖ కంపెనీలు కొటక్ మహీంద్ర, ముత్తూట్ ఫైనాన్స్, డామినీర్ ఇంటీరియర్స్, కూరాకు ఫైనాన్సియల్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ పాల్గొని వారికి అవసరమైన అభ్యర్థులను ఎంపిక చేసుకుంటాయన్నారు. జాబ్ ఫెయిర్‌లో గ్రాడ్యుయేట్ ట్రైనీ, మార్కెటింగ్ మేనేజర్, రిలేషన్‌షిప్ మేనేజర్, పర్చేజ్ అసిస్టెంట్ వంటి పోస్టులకు ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు. పదో తరగతి, ఐటీఐ, ఇంటర్, డిప్లమో, ఏదేని డిగ్రీ, బీటెక్, ఎంబీఏ చదివిన వారు పాల్గొనేందుకు అర్హులు అన్నారు. ప్రస్తుతం చివరి సంవత్సరం చదువుతున్న వారితో పాటు కోర్సు పూర్తిచేసిన వారు కూడా వారి అర్హత సర్టిఫికెట్లతో హాజరుకావచ్చున్నారు. ఎంపికయ్యిన అభ్యర్థులకు అదేరోజు నియామక పత్రాలు అందజేస్తామని తెలిపారు. మరింత సమాచారం కోసం కళాశాలలోని జేకేసీ సెంటర్‌లో స్వయంగా కానీ జేకేసీ సమన్వయకర్త జి.విజయదీప్ 9573778554 నంబర్‌లో కానీ సంప్రదించాలని కోరారు.

జాతీయ పోటీల్లో రాణించాలి



మధురానగర్(విజయవాడసెంట్రల్): ఆలిండియా సివిల్ సర్వీసెస్ బాడ్మింటన్ పోటీలకు ఎంపికయ్యిన ఎస్ఆర్ఆర్ కళాశాల అధ్యాపకురాలు డాక్టర్ జి.లలితను గురువారం కళాశాల వ్యాయామ విద్యా విభాగం ఆధ్వర్యాన సత్కరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి మాట్లాడుతూ తమ కళాశాల అధ్యాపకురాలు ఆలిండియా సివిల్ సర్వీసెస్ బాడ్మింటన్ పోటీలకు ఎంపిక కావటం ఆనందంగా ఉందన్నారు. జాతీయ పోటీల్లో కూడా మరింత మెరుగైన ప్రదర్శనతో పతకాలు సాధించి కళాశాలకు, రాష్ట్రానికి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. లలిత ఈ నెల3వ తేదీ నుంచి 9వ తేదీవరకు ఛండీఘర్‌లో జరగబోవు ఆలిండియా సివిల్ సర్వీసెస్ బాడ్మింటన్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. కళాశాల వ్యాయామ విద్య అధ్యాపకులు మండవ కోటేశ్వరరావు, డి.యుగంధర్ కళాశాల అధ్యాపకులు లలితను సత్కరించారు.

నగరంలో సందడి చేసిన నేహాశెట్టి



మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): డీజే టిల్లు ఫేమ్, సినీ నటి నేహా శెట్టి గురువారం నగరంలో సందడి చేశారు. గాయత్రి నగర్‌లోని వీఎస్ఎన్ మాల్‌లో 'రాన్' పేరుతో ఏర్పాటు చేసిన వస్త్ర దుకాణాన్ని గురువారం సాయంత్రం ఆమె ప్రారంభించారు. నేహాశెట్టి రాకతో ఆ ప్రాంతంలో యువత కేరింతలతో నిండిపోయింది. టిజే టిల్లు సినిమాలో నేహాశెట్టి పాత్ర పేరు అయిన రాధిక అంటూ యువత సందండి చేశారు. డీజే టిల్లు సినిమా పాటలకు నేహా శెట్టి డ్యాన్స్ చేసి యువతకు ఉత్సాహపరిచారు. విజయవాడ అంటే తనకు చాలా ఇష్టమని నేహా శెట్టి చెప్పారు. రాన్ షోరూమ్ అధినేత విక్రమ్‌రెడ్డి మాట్లాడుతూ ఫ్యాషన్ అంటే ఇష్టపడే వారికి రాన్ స్టోర్ సరైన ఎంపిక అవుతుందన్నారు.

పోలీసు అధికారులకు ఆత్మీయ వీడ్కోలు



విజయవాడస్పోర్ట్స్: సుదీర్ఘకాలం పాటు పోలీస్ శాఖ ద్వారా ప్రజలకు సేవలందించి గురువారం ఉద్యోగ విరమణ పొందిన సూర్యారావుపేట ఎస్ఐ ఎన్.శ్యామలరాజు, సీఏఆర్ ఎస్ఐ బి.జాన్‌సుభాకరరావులకు అడ్మిన్ డీసీపీ కృష్ణమూర్తినాయుడు, స్పెషల్ బ్రాంచ్ ఏడీసీపీ టి.కనకరాజు ఘనంగా వీడ్కోలు పలికారు. పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఇద్దరు అధికారులను శాలువాలతో ఘనంగా సన్మానించి, వారి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సీఏఆర్ ఏసీపీ డి.ప్రసాదరావు, కార్యాలయ ఏవో రంగారావు, పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడు సోమయ్య పాల్గొన్నారు.

ముగిసిన శిలువగిరి మహోత్సవాలు

నందిగామ : క్రైస్తవులు అన్ని విషయాల్లో ఇతరులకు మార్గదర్శకంగా ఉండాలని విజయవాడ మేత్రాసన పీఠాధిపతి రెవరెండ్ డాక్టర్ తెలగతోటి జోసఫ్ రాజారావు సూచించారు. పట్టణ శివారుల్లోని పల్లగిరి కొండపైగల శిలువగిరి మహోత్సవాల్లో గురువారంతో ముగిశాయి.జోసఫ్ రాజారావు సమష్టి దివ్యబలి పూజ సమర్పించారు. ఈ సందర్భంగా వాక్యోపదేశం చేస్తూ, క్రైస్తవం మతం కాదని, పరలోక రాజ్యానికి చేర్చే మార్గమని బోధించారు. క్రీస్తును మంచి మనస్సుతో ఆరాధించాలని సూచించారు. విచారణ గురువు రెవరెండ్ ఫిలోమెన్ రాజు ఆధ్వర్యంలో నిర్వహించారు.

మంచి చేస్తున్న ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి

ఎంపీ కేశినేని నాని, ఎమ్మెల్యే వెలంపల్లి



ప్రజలతో మాట్లాడుతున్న ఎంపీ కేశినేని నాని, వెలంపల్లి శ్రీనివాసరావు, పూనూరు గౌతంరెడ్డి

మధురానగర్(విజయవాడసెంట్రల్): మంచి చేస్తున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని ఎంపీ కేశినేని నాని తెలిపారు. 31వ డివిజన్ శ్రీనగర్‌కాలనీలో గురువారం వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గం సమన్వయకర్త, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు, ఏపీ ఫైబర్‌నెట్ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి, కార్పొరేటర్ పెనుమత్స శిరీషతో కలిసి పర్యటించారు. ప్రతి గడపకు వెళ్లి జగనన్న చేసిన మంచిని వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటికి వెళ్తుంటే ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని చెప్పారు. మంచి చేసిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రి చేస్తామని ప్రజలు హామీ ఇస్తున్నారన్నారు. వందల కోట్ల ప్యాలెస్‌లలో ఉంటున్న రామోజీకి, జూబ్లీ హిల్స్ బంగ్లాలో ఉంటున్న రాధాకృష్ణకు ఏపీలో అభివృద్ధి ఎలా కనిపిస్తుందని ప్రశ్నించారు. జగన్ పాలనలో అభివృద్ధి లేదు అనేవారికి కళ్ళు కనిపించట్లేదా అని నిలదీశారు.

చంద్రబాబు జగన్‌కు పోటీయే కాదు...

చంద్రబాబు అసలు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పోటీయే కాదన్నారు. చంద్రబాబు, జగన్ పాలనకు చాలా వ్యత్యాసం ఉందన్నారు. పేదలు సంతోషంతో, ఆరోగ్యంగా ఉండడమే అసలైన అభివృద్ధి అని తెలిపారు. డెవలప్‌మెంట్ గణాంకాలు తీసుకుంటే చంద్రబాబే ఏ రంగంలో అయినా తక్కువగా ఉంటారన్నారు. పేదల పిల్లలు ప్రపంచంతో పోటీ పడుతున్నారన్నారు.

బొండా ఉమా బ్లాక్ మెయిలర్...

బొండా ఉమ బ్లాక్ మెయిలర్ అని దుయ్యబట్టారు. స్వాతంత్ర సమరయోధుల భూముల ఆక్రమించిన బొండ ప్రజా జీవితానికి పనికి రాడని ధ్వజమెత్తారు. రాష్ట్రానికి చీడ పురుగు చంద్రబాబే అని ఎద్దేవా చేశారు. చంద్రబాబు డబ్బు తీసుకుని టికెట్లు ప్రకటిస్తున్నాడన్నారు. స్పెషల్ ప్యాకేజ్ ఇస్తే మొదటి లిస్ట్, నార్మల్ ప్యాకేజి ఇస్తే రెండోలిస్ట్ వదులుతున్నారని తెలిపారు. డబ్బు ఇవ్వకపోతే టికెట్లు ఇవ్వట్లేదని చెప్పారు. ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ బొండా ఉమ ఎన్నో దుర్మార్గాలు చేశాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. భూ దందాలు చేసే వ్యక్తి తమకు వద్దని సెంట్రల్ ప్రజలు చెబుతున్నారన్నారు. అనంతరం రజకులకు ఇస్త్రీ పెట్టెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా, పలువురు కార్పొరేటర్లు, వైఎస్సార్ సీపీ డివిజన్ అధ్యక్షులు పెనుమత్స సత్యం, డివిజన్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, సచివాలయం కన్వీనర్లు, మండల పార్టీ అధ్యక్షులు, జేసీఎస్ ఇన్‌చార్జులు పార్టీ నాయకులు వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లు పార్టీ గృహ సారథులు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న పేదల పక్షపాతి

ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు



61వ డివిజన్లో సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు

పాయకాపురం(విజయవాడరూరల్): రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల ద్వారా పొందుతున్న లబ్ధితో మళ్లీ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలని ప్రజలు కోరుకుంటున్నారని ఎమ్మెల్యే, సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా 61వ డివిజన్ శాంతినగర్లో వెలంపల్లి శ్రీనివాసరావు ప్రతి కుటుంబానికి వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల బ్రోచర్లను అందించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యలకు సంబంధించి సంబంధిత అధికారులకు ఫోను చేసి పరిష్కరించాలని ఆదేశించారు. సుమారు 270 గడపలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా వెలపంల్లి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల పక్షపాతి అని తెలిపారు. పేదలు ఏ విషయంలోనూ ఇబ్బంది పడకూడదని ఇళ్ల స్థలాలను పంపిణీ చేయడంతో పాటు గృహాలు నిర్మించుకునేందుకు ఒక్కొక్క ఇంటి నిర్మాణానికి లక్షా 80వేల రూపాయల చొప్పున ఆర్థిక సహాయం అందించారని చెప్పారు. అమరావతిలో పేదలకు ఇళ్ల స్థలాలు అందిస్తే చంద్రబాబు కోర్టుకెళ్లి స్టే తీసుకున్నాడన్నారు. గత టీడీపీ పాలనలో నిర్లక్ష్యానికి గురైన 61వ డివిజన్లో వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు చేశామని వెల్లడించారు. రోడ్లు, డ్రెయిన్లు, పార్కులు నిర్మాణాలు చేశామని వివరించారు. ఓట్లు అడిగే అర్హత ఒక్క వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకే ఉందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనుల కారణంగా డివిజన్లో ప్రజలు ఘనంగా స్వాగతం పలుకుతున్నారన్నారు. ఈ పర్యటనలో కార్పొరేటర్ ఉమ్మడి రమాదేవి, డివిజన్ పార్టీ నాయకులు బల్లం కిషోర్, నాలం బాబు,ఉమ్మడి వెంకట్రావ్, నాగిరెడ్డి, వెంకటేశ్వరావు, గృహసారథులు, కన్వీనర్లు పాల్గొన్నారు.

మానవత్వం చాటిన సీఐ దుర్గాప్రసాద్

పాయకాపురం(విజయవాడరూరల్): రోడ్డు ప్రమాదంలో గాయపడిన ప్రైవేట్ స్కూల్ టీచర్‌ను తన జీపులో ఆస్పత్రికి తరలించి నున్న సీఐ కె.దుర్గాప్రసాద్ మానవత్వాన్ని చాటుకున్నారు. కండ్రికలోని కేర్ అండ్ షేర్ స్కూల్ ఉపాధ్యాయురాలు బట్ట రజిని గురువారం తన విధులు ముగించుకుని తన స్కూటీపై ఇంటికి తిరిగి వెళ్తున్నారు. ఈ క్రమంలో స్థానిక ప్రకాష్‌నగర్ సెంటర్‌లో ఏపీ03 టిజే 0237 నంబరు గల వ్యాన్ వేగంగా వచ్చిన ఆమెను ఢీ కొట్టింది. బాధితురాలి కాలుపై నుంచి వ్యాన్ వెళ్లడంతో రోడ్డుపై ఆమె రక్తమోడింది. అదే సమయంలో విధుల నిమిత్తం అటుగా వెళ్తున్న సీఐ దుర్గాప్రసాద్ ఈ విషయం గమనించి క్షతగాత్రురాలిని సిబ్బంది సాయంతో తన జీపులో ఎక్కించుకుని హుటాహుటిన విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన వ్యాన్‌ను స్టేషన్‌కు తరలించి డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదం జరిగిన వెంటనే స్పందించి మానవతా దృక్పథంతో బాధితురాలిని ఆదుకున్న సీఐ దుర్గాప్రసాద్‌ను స్థానికులు అభినందించారు.

యువతకు ఉపాధి కల్పనే లక్ష్యం

పెనమలూరు: నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతోనే జాబ్‌మేళా నిర్వహిస్తున్నామని జిల్లా ఉపాధి కల్పన అధికారి డి.విక్టర్‌బాబు అన్నారు. పోరంకిలో గురువారం హ్యాపీ మైండ్స్ ట్రెనింగ్ సెంటర్‌లో జిల్లా ఉపాధి కల్పన శాఖ, స్కిల్ డెవలప్‌మెంట్ సంస్థ వారు సంయుక్తంగా మినీ జాబ్‌మేళాను నిర్వహించారు. ఈ సందర్భంగా విక్టర్‌బాబు మాట్లాడుతూ ప్రభుత్వ ఆధ్వర్యంలో జాబ్‌మేళాలు నిర్వహించి యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నామని అన్నారు. జాబ్‌మేళాలో 31 మంది ఇంటర్వ్యూలకు హాజరయ్యారని తెలిపారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎస్.శ్రీనివాసరావు మాట్లాడుతూ యువతలో నైపుణ్యం పెంపొందించే విధంగా అనేక చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. యువతకు ఉపాధి కోసం ప్రముఖ కంపెనీలను సంప్రదించి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నామని తెలిపారు. అనంతరం పలువురికి ఉద్యోగ నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఏపీఎస్ఎస్‌డీసీ జిల్లా నియామక అధికారి తుర్లపాటి మధు, కోఆర్డినేటర్ ఎం.శంకర్, కంపెనీల హెచ్ఆర్ ప్రతినిధులు పాల్గొన్నారు.

తిరుపతి నుంచి ఎంపీగా పోటీ చేస్తా

లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు విజయ్‌కుమార్



మాట్లాడుతున్న విజయ్‌కుమార్

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): ప్రత్యేక హోదా అంశంపై పోరాడటానికి తమ పార్టీ తరపున తిరుపతి పార్లమెంట్ నియోజకవర్గం నుంచి తాను ఎన్నికల్లో పోటీ చేస్తానని లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి, జి.విజయ్‌కుమార్ చెప్పారు. నగరంలో హోటల్‌లో ఆయన గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. విజయ్‌కుమార్ మాట్లాడుతూ ఎన్నికల్లో పోటీ చేస్తున్న అన్ని పార్టీలు ప్రజలకు మేము అధికారంలోకి వస్తే ఇది చేస్తామంటూ మ్యానిఫెస్టోలు ప్రకటిస్తున్నాయే కానీ, ప్రజలకు ఏమి కావాలనే విషయాన్ని వారిని అడగడం లేదన్నారు. లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ, జైభారత్ నేషనల్ పార్టీ లాంటి వాటితో కలిసి రాష్ట్రంలో మూడో ప్రత్యమ్నాయాన్ని ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఎన్నికల సీట్ల కేటాయింపులో తమ పార్టీలో యువతకు అధిక ప్రాధాన్యం ఇస్తామని చెప్పారు. తాను రాష్ట్రంలోని అనేక ప్రాంతాలకు స్వయంగా వెళ్లి ప్రజలతో మాట్లాడుతూ వారు ప్రభుత్వం నుంచి ఏమి ఆశిస్తున్నారో తెలుకుంటున్నానని తెలిపారు. యవతకు ఉద్యోగాలు, మహిళలకు రక్షణ, పరిశ్రమల స్థాపించడానికి బ్యాంకుల నుంచి రుణాలు యువత కోరుకుంటున్నారని చెప్పారు.

అమర గాయకుల సేవలు సదా స్మరణీయం



మాట్లాడుతున్న రమా సత్యనారాయణ, వేదిక మీద శ్రవంతి కృష్ణ మల్లాది స్వాతి తదితరులు

విజయవాడ కల్చరల్: అమర గాయకుల సంగీత సేవలు సదా స్మరణీయమని విశ్వమాతా చారిటబుల్ వ్యవస్థాపకుడు నిడుమోలు రమా సత్యనారాయణ అన్నారు. శ్రవంతి కృష్ణా ఈవెంట్స్ అండ్ ఎంటర్‌టైనర్, తెలుగు కళావాహిని, జీఆర్‌కే పోలవరపు సాంస్కృతిక సమితి, అక్కినేని నాగేశ్వరరావు ఫౌండేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో గురువారం అమర గాయకులకు స్వరాజంలి కార్యక్రమం నిర్వహించారు. రమా సత్యనారాయణ మాట్లాడుతూ అలనాటి మధుర గాయకులు రాగ, తాళ, యుక్తంగా గానం చేసి అభిమానులను రంజిపజేసేవారన్నారు. శ్రవంతి కృష్ణ మాట్లాడుతూ నాటి గాయనీ గాయకుల సేవలను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. విశ్రాంత పోలీస్ అధికారి కె.డేవిడ్‌రాజు గాయకుల కృషిని అభినందించారు. మల్లాది స్వాతి మీరాకుమార్, టీర్ సుషీల్‌కుమార్, భారతి, శ్రీనివాసరావు, కేవిఎస్ఎన్ మూర్తి, ఘంటసాల, బాలసుబ్రహ్మణ్యం, భానుమతి తదితరులు గానం చేసిన సినీ గీతాలను ఆలపించారు. గాయకుడు కేఎస్ఎన్ మూర్తిని నిర్వాహకులు ఆత్మీయంగా సత్కరించారు.

పక్షుల దాహార్తి తీర్చేందుకు నీటి కుండీలు ఏర్పాటు



లబ్బీపేట(విజయవాడతూర్పు): రోజు రోజుకు ఎండ తీవ్రత పెరుగుతున్న దృష్ట్యా పక్షుల దాహార్తిని తీర్చేందుకు సిద్ధార్థ ప్రభుత్వ వైద్య కళాశాల ప్రాంగణంలో నీటి కుండీలు ఏర్పాటు చేశారు. పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన కుండీల్లో గురువారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కంచర్ల సుధాకర్, అసిస్టెంట్ డైరెక్టర్ సుమైల నీటిని పోశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వేసవి ముగిసే వరకూ కళాశాలలో ఏర్పాటు చేసిన కుండీల్లో నీటిని నింపనున్నట్లు తెలిపారు. పక్షుల కోసం మంచినీటి సదుపాయం ఏర్పాటు చేయడం ఎంతో సంతోషంగా ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

నయనానందకరం.. శిడిబండి ఉత్సవం



ఉయ్యూరు: వీరమ్మతల్లికి జై అంటూ భక్తజన హారతుల నడుమ శిడిబండి ఊరేగింపు శోభాయమానంగా జరిగింది. ఉయ్యూరు ప్రధాన ఘట్టమైన శిడిబండి వేడుక గురువారం నయనానందకరంగా సాగింది. పాత వాటర్ ట్యాంకు బజారులో ప్రత్యేకంగా తయారు చేసిన శిడిబండికి గుమ్మడికాయలు ఏర్పాటు చేసి భక్తులు పసుపు నీరు ఓరబోయడంతో ఊరేగింపు ప్రారంభమైంది. కాలేజీ రోడ్డు, ప్రధాన సెంటరు గుండా సాగిన శిడి బండి ఊరేగింపులో వేలాదిగా భక్తులు తరలివచ్చారు.

ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్‌కు సత్కారం



లబ్బీపేట(విజయవాడతూర్పు): వైద్య విద్యార్థులకు అవసరమైన సదుపాయాలు కల్పించినందుకు గానుగవర్నమెంట్ డాక్టర్స్ అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ (జీడీఏ ఏపీ) ఆధ్వర్యంలో సిద్ధార్థ ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కంచర్ల సుధాకర్‌ను సత్కరించారు. అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ కొణిదె రవి, డాక్టర్ వాసిరెడ్డి అరుణ, జనరల్ కౌన్సిల్ సభ్యులు డాక్టర్ ఇంజేటి బాబ్జి శ్యామ్‌కుమార్ ప్రిన్సిపాల్ చాంబర్‌కు వెళ్లి డాక్టర్ సుధాకర్‌ను సత్కరించి అభినందనలు తెలిపారు. కంప్యూటర్లు, ఎన్‌సీడీ ప్రొజెక్టర్లు, రైటింగ్ బోర్డులు, స్టేషనరీని సమకూర్చినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

రెండో అదనపు జిల్లా కోర్టు ఎన్డీపీఎస్ స్పెషల్ పీపీగా క్రిస్టోఫర్



విజయవాడస్పోర్ట్స్: విజయవాడ రెండో అదనపు జిల్లా కోర్టు నార్కోటిక్ డ్రగ్స్ సైకోట్రోపిక్ సబ్‌స్టాన్సెస్ (ఎన్డీపీఎస్) ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా ఇ.డి.క్రిస్టోఫర్‌ను నియమిస్తూ రాష్ట్ర హోం శాఖ ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు గురువారం ఆయన పదవీ బాధ్యతలు తీసుకున్నారు. స్పెషల్ పీపీగా నియమితులైన క్రిస్టోఫర్‌ను వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ ప్రతినిధులు అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

పెనమలూరు: తాడిగడప జంక్షన్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులకు గాయాలు అవడంతో పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పోరంకి లక్ష్మీపురంకాలనీలో బండి పిచ్చయ్య ఉంటున్నాడు. అతను విజయవాడలో అధ్యాపకుడిగా పని చేస్తాడు. అతని భార్య డెలివరీ కావడంతో ఆస్పత్రి వెళ్లడానికి పిచ్చయ్య, అతని మేనల్లుడు పోతురాజురమేష్ బయలుదేరి తాడిగడప జంక్షన్ వద్దకు రాగా, ఎదురుగా వచ్చిన మరో బైక్ వీరిని ఢీ కొట్టింది. ఈ ఘటనలో బైక్‌పై ఉన్న ఇద్దరూ రోడ్డపై పడి గాయపడ్డారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

శరవేగంగా అభివృద్ధి పనులు

ఎమ్మెల్యే మల్లాది విష్ణు

పాయకాపురం(విజయవాడరూరల్): నియోజకవర్గంలో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నట్లు రాష్ట్ర ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్, ఎమ్మెల్యే మల్లాది విష్ణు తెలిపారు. 63వ డివిజన్ విశాలాంధ్ర కాలనీలో రూ.21.40 లక్షలతో నిర్మించిన ఓపెన్ డయాస్‌ను కార్పొరేటర్ మోదుగుల తిరుపతమ్మతో కలిసి గురువారం ఆయన ప్రారంభించారు. అనంతరం రూ.11.07 లక్షలతో చేపట్టిన పార్కు సూపర్‌వైజర్ గది నిర్మాణానికి భూమిపూజ నిర్వహించారు. దాదాపు 300 కుటుంబాలు నివసించే విశాలాంధ్ర కాలనీలో ప్రజలు శుభకార్యాలు చేసుకునేందుకు కల్యాణ మండపం లేకపోవడంతో కొంతమంది రోడ్లపైన, మరికొందరు దూరప్రాంతాలకు వెళ్లి జరుపుకోవాల్సి వచ్చేదని తెలిపారు. దీంతో స్థానికుల అవసరాల దృష్ట్యా ఈ ప్రాంతంలో ఓపెన్ డయాస్‌ను నిర్మించి ప్రహరీతో పరిరక్షించుకోవడం సంతోషంగా ఉందన్నారు. గతంలో ఈ ప్రదేశం పిచ్చి మొక్కలు, చెత్తాచెదారంతో అపరిశుభ్రంగా ఉండేదని గుర్తు చేశారు. కానీ నేడు సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుకోవడంతో ప్రజలు బయట ప్రాంతాలకు వెళ్లకుండా ఇక్కడే శుభకార్యాలు నిర్వహించుకునే అవకాశం లభించిందని పేర్కొన్నారు. తెలుగుదేశం గత పాలన నియోజకవర్గానికి శాపమని, ప్రజలకు ఏ మాత్రం ఉపయోగపడలేదని విమర్శించారు. కానీ వైఎస్సార్ సీపీ అధికారం చేపట్టాక అభివృద్ధి కార్యక్రమాలపై చక్కని ప్రణాళికతో ముందుకు వెళుతున్నట్లు వెల్లడించారు. స్థానిక ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా డివిజన్లో మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నట్లు వివరించారు. 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.1.25 కోట్ల వ్యయంతో డాక్టర్స్ కాలనీ రోడ్లను పూర్తి చేసుకున్నట్లు వెల్లడించారు. ఈడబ్ల్యుఎస్ కాలనీలో రూ.1.50 కోట్ల వీఎంసీ సాధారణ నిధులతో రహదారులు నిర్మించామని వివరించారు. రూ.60లక్షలతో ఎల్ఐజీ, 1.2 ఎంఐజీ–1 కాలనీలలో రోడ్లు నిర్మించుకున్నట్లు చెప్పారు. రూ.14 లక్షలతో తెలుగుతల్లి పార్కును తీర్చిదిద్దినట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఈ (ఇంజినీరింగ్) గురునాథం, ఏఈ మాధవ్, డివిజన్ అధ్యక్షుడు పసుపులేటి యేసు, పార్టీ నాయకులు మోదుగుల గణేష్, సీహెచ్ రవి, టిక్యం కృష్ణ,నాగేశ్వరావు, రాజేశ్వరి, తిరుపతిరావు, కమలేష్, అలీ, ఆర్.యేసు, అనిల్, సూర్యనారాయణ, సూపర్‌వైజర్ విక్టర్‌బాబు, సచివాలయ సిబ్బంది కాలనీ వాసులు పాల్గొన్నారు.



63వ డివిజన్లో ఓపెన్ డయాస్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు

అధ్యాపకులకు పునరుచ్చరణ తరగతులు



వర్చువల్‌గా మాట్లాడుతున్న డాక్టర్ పోలా భాస్కర్

మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం అధ్యాపకులకు ఐదురోజుల పునరుచ్చరణ తరగతులు ప్రారంభమయ్యాయి. కళాశాల విద్య కమిషనర్ డాక్టర్ పోలా భాస్కర్ తరగతులను వర్చువల్‌గా ప్రారంభించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న తొమ్మిది నోడల్ రిసోర్స్ సెంటర్స్ ద్వారా అధ్యాపకులకు ఐదు రోజుల పాటు శిక్షణ ఇస్తున్నామన్నారు. ఇక్కడ నేర్చుకున్న అంశాలను కళాశాలలో విద్యా ప్రమాణాలు మెరుగుపరచటానికి ఉపయోగించాలని సూచించారు. అనంతరం హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీలో మాస్టర్ ట్రెనర్స్‌గా శిక్షణ పొందిన అధ్యాపకులు శిక్షణ ఇచ్చారు. మారుతున్న కాలానుగుణంగా విద్యా బోధనలో మెలకువలను వివరించారు. కార్యక్రమంలో ఎన్ఆర్‌సీ కోఆర్డినేటర్ డాక్టర్ సీహెచ్ అప్పారావు, ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా జాతీయ సైన్స్ దినోత్సవం



మహాత్మాగాంధీ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో విద్యార్థుల ప్రదర్శనలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరంలోని మహాత్మాగాంధీ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో గురువారం జాతీయ సైన్స్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. సైన్స్ ఎగ్జిబిషన్‌లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విద్యార్థులు తాము చేసిన సైన్స్ మోడల్స్‌ను ప్రదర్శించటంతో పాటు వాటి గురించి వివరించారు. చంద్రయాన్-4, విండ్ మిల్, హ్యూమన్ రెసిపిరేటరీ సిస్టమ్, ఫైర్ అలారమ్, సర్ఫేస్ టెన్షన్, స్మోక్ బబుల్, నేచురల్ ప్రాసెస్ ఆఫ్ వాటర్ ప్యూరిఫికేషన్ వంటి మోడల్స్ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో దక్షిణ భారత్ హిందీ ప్రచార సభ హైదరాబాద్ మేనేజర్ రమాకాంత్, విజయవాడ బ్రాంచి మేనేజర్ శ్రీరామ్ శ్రీనివాస్, పీజీ డిపార్ట్‌మెంట్ హెడ్ పి. శ్రీనివాస్, బల్విందర్, సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.కె. షమీలా పర్వీన్ విద్యార్థులు చేసిన మోడల్స్‌ను పరిశీలించి వారిని అభినందించారు.

హిమాలయ ఆప్టికల్స్ ప్రారంభం



బెంజిసర్కిల్ సమీపంలో ఏర్పాటు చేసిన హిమాలయ ఆప్టికల్ షోరూమ్

లబ్బీపేట(విజయవాడతూర్పు): బెంజిసర్కిల్ సమీపంలోని సాయినగర్‌లో ఏర్పాటు చేసిన హిమాలయ ఆప్టికల్స్ షోరూమ్ గురువారం ప్రారంభమైంది. ఈ షోరూమ్‌లో కంటి దృష్టికి అవసరమైన అనేక అత్యుత్తమమైన కళ్ల అద్దాలు, విలాసవంతమైన కళ్లజోళ్లు అందుబాటులో ఉంటాయని హిమాలయ ఆప్టికల్స్ క్లస్టర్ మేనేజర్ సంతోషి శిఖా తెలిపారు. సమకాలీన పోకడలకు అనువైన అద్భుతమైన కళ్ల అద్దాలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. విలాసవంతంగా ధరించే స్టయిలిష్ సన్ గ్లాసెస్ నుంచి వైద్యులు సూచించిన ప్రిస్కిప్షన్ గ్లాసెస్ వరకూ అన్ని రకాల కళ్ల జోళ్లు స్టోర్‌లో లభిస్తాయని చెప్పారు. ప్రతిష్టాత్మకమైన అనేక బ్రాండ్లను ఖాతాదారుల కోసం అందుబాటులోకి తెస్తున్నామని పేర్కొన్నారు. ప్రతి ఒక్క ఫ్రేము , డిజైన్, సన్ గ్లాసెస్ ఎంతో కళాత్మకంగా తీర్చిదిద్ది ఉంటాయన్నారు. రేబాన్, ఒక్లే, వోగ్, కెరీరా, ఫిలా, ఎంపోరియా అర్మని, ఎస్ప్రిట్ వంటి 60కి పైగా ప్రఖ్యాత బ్రాండ్ల కళ్లజోళ్లను హిమాలయ అందిస్తుందన్నారు.